# సేవ్ రాక్స్

నేను చిన్నగున్నప్పుడు ఎండకాలం తాతీల్లకు మా అమ్మమ్మ ఊరికి బోయినం. మా చెల్లె, మా తమ్ముండ్లు గూడ నాతోని ఊరికి వొచ్చింద్రు. మేమందరం రేల్‌గాడిల గా ఊరికి బోయినం. రేల్‌టేషన్‌కు రెండు మైల్ల దూరంల ఊరు ఉన్నది. టేషన్‌కెల్లి ఊరికి బోవాలంటె టాంగలల్లనన్న బోవాలె. లేకుంటె నడిసనన్న బోవాలె. రేల్ దిగినంక మా నాయిన ఒక టాంగ మాట్లాడిండు. మేమందరం టాంగల గూసున్నం. చెట్లను పచ్చటి పొలాలను జూసుకుంట మా అమ్మమ్మ ఊరికి బోయినం.

ఊరి నడ్మ మా అమ్మమ్మ బంగ్ల ఉన్నది. గది రెండంత్రాల బంగ్ల. గా బంగ్లకు ముంగటనే గాకుంట ఎన్క గూడ కాలి జాగ ఉన్నది. గా జాగల తీరుతీర్ల చెట్లు ఉన్నయి. బంగ్లకు ముంగట ఉన్న కాలి జాగల పూల చెట్లు ఉంటె బంగ్ల ఎన్క జాగల పండ్ల చెట్లు ఉన్నయి. బంగ్ల ముంగట గూసునే తందుకు అరుగులు గూడ ఉన్నయి.

గంటల మేము మా అమ్మమ్మ బంగ్ల కాడ్కి బోయినం. టాంగల కెల్లి దిగినం. నన్ను మా చెల్లె, తమ్ముండ్లను మా నాయిననే టాంగల కెల్లి కిందికి దించిండు. పూల చెట్ల నడ్మీట్ల కెల్లి నడ్సుకుంట బోయినం. అర్గుమీద గూసోని మా తాత సుట్ట దాగుతున్నడు. మమ్ములేను జూసి-

"బాగుండ్రా" అని అడిగిండు.

"బాగున్నం తాతా!" అని మేము అన్నం.

అందరం తానాలు జేసినంక గింత దిన్నం. తిని మంచిగ బన్నం. దీపాలుబెట్టే యాల్ల మేము నిద్రలేసినం. బంగ్ల ఎన్క ఉన్న తోటలకు బోయినం. నేను జాంచెట్టు ఎక్కి జామకాయలు దెంపిన. తెంపిన జాం కాయలను మా చెల్లెకు, తమ్ముండ్లకు ఇచ్చిన. నేను ఒక జాం కాయను దీస్కున్న. మేమందరం జాం కాయలు దినుకుంట తోటల దిర్గబట్టినం. ఇంతల మా అమ్మమ్మ తోటలకు వొచ్చింది.

"శీకటయితున్నది. తోటల దిర్గకుండ్రి. లోపల్కి పాండ్రి" అని మా అమ్మమ్మ అన్నది.

మేమందరం బంగ్లలకు బోయినం. మా అమ్మమ్మ మా అందరికి సకినాలు ఇచ్చింది. సకినాలు దినుకుంట గూసున్నం. నాత్రి దిన్నంక బంగ్ల మీద మంచాలు ఏసింద్రు. మా అమ్మమ్మ గూడ మా పక్కపంటే మంచం ఏస్కున్నది. దినం పూట పండె బట్కె మాకు ఎంతకు నిద్రరాలేదు.

"అమ్మమ్మా! మా కొక కత జెప్పే" అని మా చెల్లె అన్నది.

"చెప్త. ఇనుండ్రి. బండ కింద సోమారంల అండాలమ్మ అనేటి ఒక వైను పోరి ఉన్నది. అందరి లెక్కనే ఉన్న గా పోరికి ఏమైందేమో గని ఒక దినం శిగమొచ్చింది. శిగమూక్కుంట గా పోరి నెల దినాలల్ల రౌతు బొమ్మను అయితనని జెప్పింది. ఊరోల్లందరు గా పోరి మాటలను బరోస జేసింద్రు. దినాం గామెను జూసెతందుకు జెనం రాబట్టింద్రు. గీ సంగతి సుట్టుపక్కల ఉన్న ఊరోల్లకు గూడ ఎర్క అయ్యింది. గాల్లు కచ్చాలు గట్కోని బండ కింది సోమారం



రాబట్టింద్రు. అండాలమ్మ కాల్లు మొక్కబట్టింద్రు. కట్నాలు ఇయ్యబట్టింద్రు. కట్నాలు ఇచ్చినోల్లకు అండాలమ్మ పసుపుబొట్టు బెట్టబట్టింది.

సింగిల్ పేజీ కథ

మెల్లమెల్లగ గీ సంగతి పట్నపోల్లకు గూడ ఎర్క అయ్యింది. రేల్‌గాడిలల్ల, బస్సులల్ల పట్నం కెల్లి గూడ జెనం రాబట్టింద్రు. పేపర్లు గూడ అండాలమ్మ గురించి రాసినయి. మంది ఎక్వ వస్తుండె బట్కె అండాలమ్మను జూసెతందుకు టికిట్ బెట్టింద్రు. టికిట్ బెట్టినంక గూడ మస్తుమంది గామెను సూసె తందుకు రాబట్టింద్రు. గామె కాల్లు మొక్కితె అంత మంచిగైతదని జెనం బరోసజెయ్యబట్టింద్రు. ఆమ్దాని హెచ్చె బట్కె అండాలమ్మ బంగారి సొమ్ములు జేపిచ్చింది. అయితారం దినాన గా సొమ్ములు బెట్టుకోని జెనంకు గండ్ల బడబట్టింది. ఇగ దాంతోని అయితారం దినాన గామెను జూసెతందుకు మస్తు మంది రాబట్టింద్రు. దాంతోని అయితారం దినాన గామెను జూసెతందుకు బెట్టిన టికిట్ దరను గూడ బెంచింద్రు. 'గండాలు బాపేటి తల్లో అండాలమ్మ, నిండు ముత్తైదువమ్మ నీ చెల్లె ముత్యాలమ్మ' అన్కుంట కొందరు గామె మీద పాటలు రాసింద్రు. గా పాటలను బాడుకుంట బజనలు జేసింద్రు.

గీ ముచ్చట గిట్ల ఉండంగ ఎలచ్చన్లు వొచ్చినయి. అన్ని పార్టిల లీడర్లు ఊరూరు దిరుక్కుంట ఓట్లు ఏసి మమ్ములను గెలిపిస్తె గది జేస్తం గిది జేస్తం అని జెనంకు జెప్పబట్టింద్రు. మంత్రులైతె ఊరికొక్క కొత్త పద్కం బెడ్తమని జెప్పుకుంట శంకుస్తాపనలు జెయ్యబట్టింద్రు. శంకుస్తాపనలు ఎంత గనం జేసింద్రంటె రాస్ట్రంల రాల్లే కరువైనయి. ఇగ దాంతోని కొందరు సదువుకున్న పోరలు 'సేవ్ రాక్స్' అన్కుంట బూక్‌హర్తాల్లు, రాస్తరోకోలు, దర్నలు జెయ్యబట్టింద్రు.

"సార్ మీరందరు శంకుస్తాపనల మీద శంకుస్తాపనలు జేస్కుంట రాస్ట్రంల ఒక్క రాయి గూడ లేకుంట జేస్తున్న రెందుకు?" అని విలేకరులు ఒక మంత్రిని అడిగింద్రు.

"రాల్లు ఉంటె ఒకలి మీద ఒకలు ఏస్కుంటరు. రాల్లే సుకుంటె నెత్తులు బల్గుతయి. నెత్తురు గార్తది. పోలీసోల్లు లాటిచార్జి జేస్తరు. గవన్నిటిని దప్పిచ్చేతందుకే మేము రాయి గండ్ల బడ్డె సాలు శంకుస్తాపన జేస్తున్నం" అని గా మంత్రి జెప్పిండు.

నెల దినాలైంది. అండాలమ్మ రౌతుబొమ్మ అయ్యే దినమొచ్చింది. గామె రౌతు బొమ్మ అయితుంటె సూసెతందుకు మస్తు మంది జెనమొచ్చింద్రు. టివీలోల్లు, పత్రికలోల్లు గూడ వొచ్చింద్రు. ముందు గాల్ల అందరు అండాలమ్మ కాల్లు మొక్కింద్రు. కాల్లు మొక్కినోల్లందరికి గామె పసుపుబొట్టు బెట్టింది. గామె రౌతు బొమ్మ అయితుంటె సూసెతందుకు లీడర్ల గూడ వొచ్చింద్రు. ఒక మంత్రి గూడ వొచ్చిండు.

"ఎలచ్చన్ల ప్రచారంకు బోకుంట మీరు గేడికి ఎందుకు వొచ్చింద్రు?" అని ఒక విలేకరి గా మంత్రిని అడిగిండు.

"మన రాస్ట్రంల శంకు స్తాపనలు జేద్దామంటె రాల్లు దొర్కుతలెవ్వు. అండాలమ్మ రౌతు బొమ్మ గాంగనే గా రౌతుతోని శంకుస్తాపన జేసెతందుకు గేడ్కి వొచ్చిన" అని గా మంత్రి జెప్పిండు అన్కుంట మా అమ్మమ్మ కత జెప్పింది.

- తెలిదేవర భానుమూర్తి